## 35. దుఃఖించకు

ఆరేళ్ళ తన ఏకైక కూతుర్ని విపరీతంగా ప్రేమించే ఓ తండ్రికి ఓరోజు తన పాప మరణించిందని తెలిసింది. గుండె బ్రద్దలైన అతను అంతులేని దుఃఖాన్ని అనుభవించసాగాడు. బయటి ప్రపంచానికి దూరమయ్యాడు.

ఓరాత్రి అతనికో కల వచ్చింది. ఆ కలలో స్వర్గంలోని పిల్లలంతా తెల్లటి దుస్తుల్లో, చేతిలో వెలిగే కొవొత్తులతో దేవుడి ముందు పరేడ్ చేస్తున్నారు. అయితే వారిలోని తన కూతురు చేతిలోని కొవొత్తి మాత్రం వెలగకపోవడం గుర్తించిన ఆ తండ్రి కారణం అడిగాడు.

"డేడీ. నా కొవ్వొత్తిని కూడా అందరివాటిలా వెలిగించారు. కాని, నీ కన్నీళ్ళు దాన్ని ఆర్పేసాయి." జవాబు చెప్పింది కూతురు.

నిద్ర లేచాక అతను మళ్ళీ పూర్వపు మనిషిలా జీవించసాగాడు.

## 36. కిటుకు

తనకున్నదాంట్లో చాలా భాగం బాహాటంగా దానం చేసిన ఒకతను మరణించాక స్వర్గానికెళ్ళాడు. అక్కడ వున్న తన మిత్రుడ్ని చూసి ఆశ్చర్యపోయి వెంటనే స్వర్గాధికారి దగ్గరికి వెళ్ళి అడిగాడు.

"నా మిత్రుడికిక్కడ ఎలా ప్రవేశం లభించింది? వాడిని నాలా దాన ధర్మాలు చేయమని ఎన్నిసార్లు చెప్పినా వాడు నా మాట వినలేదు కదా?"

"నువ్వు చేసిన ప్రతీ దానం ప్రపంచానికి చాటావు. కాని, నీ మిత్రుడు తను చేసిన దానం గురించి ఎవరిముందూ పెదవి విప్పలేదు. అందుకని అతనికి నీ కన్నా రెట్టింపు కాలం స్వర్గంలో ఉండటానికి అర్హత లభించింది. ప్రచారం కోసం పర్స్ నించి ఇచ్చిన దానం కంటే, రహస్యంగా హృదయం నించి ఇచ్చే దానానికే విలువెక్కువ అని తెలుసుకో." జవాబు చెప్పాడు స్వర్గాధిపతి.